ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి జిల్లా వార్తలు
3★
సోమవారం 13 జనవరి 2025



రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి

పెద్దపల్లి రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : రైతులు సాగులో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. ఆదివారం మండలంలోని రాఘవపూర్‌లో శ్రీరామ డ్రోన్స్ సర్వీసెస్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే డ్రోన్ పరికరం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో యజమాని ప్రేమ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు గంట రమేష్, వెంకటేషం, సది, సాంబిరెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మడి ప్రసాద్, అశోక్, సతీష్, మల్లేష్ లతో పాటు పలువురు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు





సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మక్కాన్ సింగ్, మేడిపల్లి సత్యం, సంజయ్‌కుమార్

- పథకాల అమలుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- ఉమ్మడి జిల్లా సమీక్షా సమావేశంలో ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకందేలా అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కరీంనగర్ కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా కార్యాచరణ ప్రణాళిక సమీక్షా సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయానికి యోగ్యమైన భూమికి పంట వేసినా, వేయకపోయినా రైతు భరోసా కింద సంవత్సరానికి 12 వేల రూపాయలు అందిస్తామన్నారు. ఈ నెల 26 నుంచి రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభిస్తామని తెలిపారు.

◆ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్

5లో..



పాల్గొన్న అధికారులు

న్యూస్ బాక్స్

పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

పెద్దపల్లి రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లిలో ప్రభుత్వపాఠశాల పదో తరగతి విద్యార్థులకు వివేకానంద యూత్ ఆధ్వర్యంలో ఆదివారం పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. వివేకానంద యూత్ సేవలను పలువురు కొనియాడారు. స్వామివివేకానంద జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో మేకల విజయ్ కుమార్, నారాయణదాసు అశోక్, పడాల రాజయ్య, పిడుగు కనుకయ్య, గాండ్ల రాజయ్య, మేకల భాస్కర్, సోగాల కొమురయ్య, మేకల వంశీకృష్ణ, కాంపెళ్ళి చంద్రయ్య, వివేకానంద యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'లక్ష డప్పులు-వేయి గొంతులు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

మంథని, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయం ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరగనున్న లక్ష డప్పులు-వెయ్యి గొంతుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాదిగ కుల సంఘాల నేతలు పిలుపునిచ్చారు. స్థానిక అంబేద్కర్‌చౌక్‌లో ఆదివారం వారు మాట్లాడారు. ఈనెల 21న పెద్దపల్లికి వస్తున్న మందకృష్ణ మాదిగ పర్యటనకు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో తగరం శంకర్‌లాల్, మంథని సామ్యేల్, బూడిద తిరుపతి, మంథని లక్ష్మణ్, వేల్పుల రాజు, మంథని లింగయ్య, కాసిపేట సాంబయ్య, వేల్పుల పోచం, వేల్పుల గట్టయ్య, కాసిపేట వెంకటేష్, ఏల్పుల శ్రావణ్, సింగారపు రాజశేఖర్, మంథని శ్రీనివాస్ పాల్గొన్నారు.

రామగిరి ఖిల్లాకు 'పర్యాటక' సొబగులు



మంథని/రామగిరి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చారిత్రక రామగిరి ఖిల్లా పర్యాటక కేంద్రంగా మారనుంది. ఖిల్లాను అభివృద్ధి చేయడానికి రాష్ట్ర పర్యాటక శాఖ ద్వారా ఇటీవల ప్రభుత్వం రూ.5 మంజూరుచేసింది. అనేక ప్రత్యేకతలు, ప్రాధాన్యం సంతరించుకున్న రామగిరి ఖిల్లాను పర్యాటక కేంద్రంగా మార్చడానికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవ తీసుకొని ప్రణాళికలు రూపొందించారు. ప్రకృతి అందాలకు, శిల్పకళా సంపదకు, ప్రాచీన సంస్కృతికి, చారిత్రక వారసత్వ సంపదకు ఆలవాలం రామగిరి ఖిల్లా. వందల సంవత్సరాలపాటు వివిధ వంశాలకు చెందిన రాజులకు శత్రు దుర్భేద్యమైన రక్షణ స్థావరంగా ఈ దుర్గం ఆశ్రయమిచ్చింది. అలాంటి రామగిరి ఖిల్లా వైభవం కాలక్రమేణా కనుమరుగవుతూ వచ్చింది. నాటి కమాన్‌పూర్ నేటి మండలం బేగంపేట గ్రామానికి ఆరు కిలో మీటర్ల దూరంలో ఎత్తైన గుట్ట మీద క్రీస్తు శకం 1వ శతాబ్దంలో రామగిరి ఖిల్లా రూపుదిద్దుకున్నట్లు చారిత్రక ఆధారాలు తెలియజేస్తున్నాయి. ఎంతో ఎత్తుగల దుర్గం అనేరాతి కట్టడాలతో, బురుజులతో, పీనాలతో విరాజిల్లుతోంది. తెలంగాణలోని దుర్గాల్లో ఈ దుర్గం పటిష్ఠంగా ఉండి వజ్రకూటంగా ప్రసిద్ధి చెందింది. పురావస్తు శాఖ దీనిని వెలుగులోకి తీసుకు రాకపోవడంతో ఇది ఎవరి దృష్టికి రాక, అడవిలో ఓ మూలన పడిఉంది. రామగిరి ప్రాంతంలో జన జీవనం సాగించినట్టు ఆధారాలు ఉన్నాయి. అనేక కట్టడాలు భూగర్భంలో కలిసినట్లు ఇక్కడివారు చెబుతారు.

● ఖిల్లాపై పర్యాటక శాఖ చేపట్టే అభివృద్ధి పనులు ఇవే..

ఖిల్లా సమీపంలో పార్కింగ్ ఏరియా అభివృద్ధి, స్వాగత తోరణం, కాంపౌండ్ వాల్, యాత్రికులకు రెస్టు షెల్టర్, చిల్డ్రన్స్ ప్లే ఏరియా, మెట్లు, వాటికి సేఫ్టీగా హ్యాండ్ గ్రిల్స్ బూత్‌రూంలు, ఖిల్లాపై ఉన్న బావుల ఆధునికీకరణ పనులు, తాగునీటి సదుపాయం, రోడ్డు అభివృద్ధి, రోడ్డు మార్గంలో బెంచ్‌ల ఏర్పాటు, వాటర్ సప్లై, శానిటరీ అండ్ ఎలక్ట్రికల్, ల్యాండ్ స్కేప్ వర్క్స్‌తోపాటు ఇతర అభివృద్ధి పనుల కోసం ప్రతిపాదనలను పర్యాటక శాఖ ద్వారా తయారు చేశారు. త్వరలో పనులను ప్రారంభించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

- పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు రూ.5 కోట్లు మంజూరు
- మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవతో ప్రణాళికలు
- త్వరలో పనులు చేపట్టనున్న అధికారులు

● రాచరిక నిర్మాణాలెన్నో..

దుర్గం అంతర్భాగంలో సాలుకోట, సింహాల కోట, జంగే కోట, ప్రతాపరుద్రుల కోట, అశ్వశాల, కొలువు శాల, మొఘల్‌శాల, చెరశాల, గజశాల, భజన శాల, సభాస్థలి వాటితో పాటు రహస్య స్థలాలు, రహస్య మార్గాలు, సొరంగాలు, తీపులు, ఫిరంగి గుండ్లు, కోట ముఖ ద్వారాలు, చెరసాలలు, కొలనులు, యుద్ధం కోసం వినియోగించిన ఫిరం గులు, ఇక్కడ దర్శనమిస్తాయి. పునాదులు, రాళ్లు, ఇటుకలు, మంచినీటి బావులవ ఆనవాళ్లు నేటికీ ఇక్కడ కనిపిస్తాయి. శ్రీరాముని మూల విగ్రహాలు ఉన్న స్థలంలో కొండచరియ కింద వెయ్యి మంది తలదాచుకోవచ్చు.

● శ్రీరాముడు తపస్సు చేసిన గుహ..

శ్రీరాముడు వన వాస కాలంలో రామగిరి కోటపై తపస్సు చేసి గుహలో శివలింగాన్ని ప్రతిష్ఠించినట్లు పురాణాలు చెబుతున్నాయి. ఇక్కడ కొండపై నుంచి వచ్చే నీటి ధార బిలం నుంచి లోయలోకి ప్రవహిస్తోంది. ఈ ధార వద్ద సీతాదేవి స్నానమాచరించేదని ప్రతీతి. ఈ కొండపై సీతారాముల విగ్రహాలతో పాటు నంది విగ్రహం ఉంది. నీటి ధార నేరుగా శివలింగం, నందివిగ్రహాలపై పడటం విశేషం.

● పరిసరాల్లో వెలసిన గ్రామాలు..

రామగిరి చుట్టు పక్కల ఉన్న ఊళ్లన్నీ ఆనాడు ఆ పట్టణంలోని వాడలని చరిత్ర చెబుతోంది. ఇప్పటి బేగంపేటలో నాడు రాజుల ఆస్థానంలో సంగీత, గాన, నృత్య, కచేరీలు నిర్వహించే బోగం వారు ఉన్నందున బోగంపేట

మిగతా 6వ పేజీలో...

● రామగిరి దుర్గం(ఖిల్లా) చరిత్ర ఇది..



క్రీస్తు పూర్వం నాలుగు వేల సంవత్సరాల క్రితం రామగిరి వెలిసినట్లు చరిత్ర వివరిస్తోంది. క్రీస్తు శకం 62వ సంవత్సరంలో గౌతమి పుత్రశాతకర్ణి, 86వ సంవత్సరంలో పులోమావి ఈ ప్రాంతాన్ని పాలించినట్లు పెద్దబొంకూరు, గుంజపడుగు గ్రామాల్లో లభ్యమైన ఆధారాలు పేర్కొంటున్నాయి. చంద్రగుప్తుడు, బిందుసారుడు, అశోకుడు ఈ దుర్గాన్ని అభివృద్ధిపరిచి బలీయంగా తీర్చిదిద్దారట. క్రీస్తు శకం 1158వ సంవత్సరంలో చాళుక్య గుండరాజును ఓడించి కాకతీయుల రామగిరి దుర్గాన్ని వశపర్చుకున్నారని, ప్రతాపరుద్రుడు 1195 వరకు ఈ దుర్గాన్ని పాలించాడని ఓరుగల్లు, మంత్రకూటముల శాసనాలు తెలియజేస్తున్నాయి. అనంతరం బహ్మనీసుల్తానులు ఈ దుర్గాన్ని ఆక్రమించుకోగా వారి నుంచి రెడ్డి రాజైన కాటయ వేమారెడ్డి స్వాధీన పర్చుకున్నట్లు, మళ్లీ మహమ్మదీయులు వశపర్చుకొని నైజాం కాలం వరకు ఏలినట్లు చరిత్రకారులు పేర్కొంటున్నారు. రామగిరి కోటలో ఇరువైపుల తొమ్మిది ఫిరంగులు, నలభై తోపులు ఉన్నట్లు, వాటిలో నుంచి ఆరు తోపులు చెన్నూర్ దేశ్‌ముఖ్‌లు తీసుకువెళ్లినట్లు స్థానికులు చెబుతారు. 1442-57 మధ్య కాలంలో సుల్తానుల ఆధీనంలో, 1595 సంవత్సరంలో మొఘలాయిలు, 1606లో గోల్కొండ నవాబు ఆధీనంలో ఈ కోట ఉన్నట్లు సమాచారం.

కార్మికుల హక్కులను కాలరాస్తున్నారు..

- హెచ్ఎంఎస్ జిల్లా అధ్యక్షుడు తోట వేణు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తోట వేణు

గోదావరిఖని, జనవరి 12(ఆంధ్రజ్యోతి): గతంలో ఎన్నడూ లేని విధంగా సింగరేణిని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చెరబట్టి సింగరేణి కార్మికుల సంక్షేమ, సామాజిక విధ్వంసానికి పాల్పడుతున్నదని హింద్ మజ్దూర్ సభ(హెచ్ఎంఎస్) జిల్లా అధ్యక్షుడు తోటవేణు ఆరోపించారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో క్వార్టర్ నిర్వాసిత కార్మికులతో కలిసి ఆయన మాట్లాడారు. రామగుండం ఎమ్మెల్యే గోదావరిఖని అభివృద్ధి పేరిట, ఎలాంటి హేతుబద్ధత, ప్రణాళికా లేకుండా నిరంకుశంగా, ఏకపక్షంగా వవహరిస్తూ సామాజిక విధ్వంసానికి పాల్పడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. రామగుండం సింగరేణి రీజియన్ అధికారులను తన చెప్పు చేతల్లో పెట్టుకుని, చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తూ సింగరేణి కార్మికుల హక్కులను కాలరాస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాడన్నారు. సింగరేణి అధికారులు కూడా ఇక్కడి ఎమ్మెల్యేకు వంత పాడుతూ, తానా అంటే తందానా అంటూ ఇల్లీగల్‌గా వ్యవహరిస్తూ కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. రామగుండం ఎమ్మెల్యే మతి లేకుండా చేపడతున్న పనులకు సింగరేణి వత్తాసు పలుకుతూ పచ్చి అబద్దాలు ప్రచారం చేస్తుండటం సిగ్గుచేటని ఆరోపించారు. పోయిన సంవత్సరం రూపొందించిన శిలాఫలకాన్ని, అందులో పేర్కొన్న 20మంది ప్రముఖులు లేకున్నా, నిస్సిగ్గుగా ఆవిష్కరించి, బడ్జెట్ అనుమతులు లేకుండానే షాపింగ్ కాంప్లెక్స్‌కు సింగరేణి రూ.20కోట్లు ఇచ్చిందని ప్రచారం చేయడం సహించరానిదన్నారు. ఇకనైనా సింగరేణి ఆర్జీ-1 అధికారులు కార్మిక పక్షపాతిగా వ్యవహరించి వారి న్యాయమైన కోరికలను తీర్చి పరిష్కారాలను కనుక్కోవాలన్నారు. లేకుంటే ఎక్కడ వేసిన గొంగలి అక్కడే ఉండి, సమస్య, పోరాటాలు మరింత తీవ్రతరం అవుతుందని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో క్వార్టర్ నిర్వాసితులు గంపల సమయ్య, పోతరాజు భాస్కర్, పీ శ్రీనివాస్, బత్తుల రాంబాబు, కాంపెల్లి రామస్వామి, బండారి శివ పాల్గొన్నారు.

వివేకానందుడి జీవితం యువతకు ఆదర్శం

- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



సుల్తానాబాద్‌లో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు



కలెక్టరేట్‌లో నివాళులర్పిస్తున్న అధికారులు తదితరులు

సుల్తానాబాద్, జనవరి 12: (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానందుడి ఆశయానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని, ఆయన జీవితం యువతకు ఆదర్శమని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని వివేకానందుని విగ్రహం వద్ద జయంతి కార్యక్రమం నిర్వహించారు. వివేకానందుని విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి జాతీయ యువజన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వామి వివేకానందుడి బోధనలు నేటి యువతరానికి ఎంతో అవసరమన్నారు. యువత వల్లనే దేశం శక్తివంతమైన దేశంగా ఎదిగిందని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీ రాజమల్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్ పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

● పెద్దపల్లి కల్చరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి సురేష్ వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వివేకానందుడి ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. అనంతరం ఈనెల 7న జరిగిన రాష్ట్రస్థాయి యూత్ ఫెస్టివల్ హైదరా బాద్‌లో పాల్గొన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పార్టిసి పేషన్ సర్టిఫికెట్‌లను అందించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు సురేందర్, రమేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగాం అధికారి శంకర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

కత్తిపోట్ల ఘటనలపై పోలీసులు సీరియస్..

కోల్‌సిటీ, జనవరి 12(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలో వరుస కత్తిపోట్ల ఘటనలను పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. స్థానిక రామాలయం సమీపంలోని సింగరేణి క్వార్టర్‌లో నివాసముండే ఆర్ఎఫ్‌సీఎల్ అవుట్ సోర్సింగ్ కార్మికుడు, ఫిజిషియన్ అసిస్టెంట్ అయిన యశ్వంత్‌పై హత్యాయత్నం కేసును చేధించేందుకు పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. నిందితులు పక్కాప్రణాళికతోనే యశ్వంత్‌పై హత్యాయత్నం చేసినట్టు భావిస్తున్నారు. వివిధ కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నారు. ఇద్దరినుంచి ముగ్గురు నిందితులు రెక్కి నిర్వహించి ఈ దాడికి పాల్పడినట్టు తెలుస్తోంది. ఇంటి వెనుక నుంచి చొరబడి యశ్వంత్‌ను మట్టుబెట్టే యత్నం చేసినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తున్నారు. యశ్వంత్ ఫోన్ డాటాను కూడా విశ్లేషిస్తున్నట్టు తెలుస్తున్నది. కొంత క్లూ కూడా లభించినట్టు సమాచారం.

19న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సుల్తానాబాద్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : సుల్తానాబాద్‌లో చదువుకున్న 1981-82 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఈనెల 19న బొంతకుంటపల్లిలోని విజయ ఏసీ గార్డెన్‌లో నిర్వహించనున్నామని ఆహ్వాన కమిటీ ప్రతినిధి, సీఎం సెక్యూరిటీ అధికారి, అడిషనల్ ఎస్పీ చెరుకు వాసుదేవరెడ్డి తెలిపారు. ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సమ్మేళనం వివరాలను వెల్లడించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా సహచర పూర్వ విద్యార్థి, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు హాజరవుతున్నారని వివరించారు. ఆహ్వాన కమిటీ చైర్మన్ గాజుల రాజమల్లు, అధ్యక్షులుగా పారుపల్లి వెంకటఉమాపతి, ఉపాధ్యక్షులుగా చెరుకు రాధాక్రిష్ణారెడ్డి, బిరుదు సంజీవ్, కొలిపాక సురేందర్, అమిరిశెట్టి మధుమతి, నర్సింగారావు, కోశాధికారి సిలువేరి తిరుపతి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా అమిరిశెట్టి తిరుపతి, సహాయ కార్యదర్శులుగా చెరుకు రమేష్‌రెడ్డి, కందుకూరి శ్రీదేవి, పూసాల మనోహర్, లెక్కల నరోత్తంరెడ్డి, నల్ల రవీందర్‌లు ఎన్నికయ్యారు.

అంగరంగ వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు

పాలకుర్తి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధి వేమునూర్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం గోదారంగనాథ స్వామి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కల్యాణంలో మండలంలోని పలు గ్రామాల భక్తులు పాల్గొన్నారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య జరిగిన ఈ కల్యాణం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.



మీడియాతో మాట్లడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

పరిపాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులపై తప్పుడు కేసులు
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

5

లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయం..

- ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు ఉపయోగం..
- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

6



మట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

చైన్ స్నాచింగ్ కేసులో నిందితురాలి అరెస్ట్

ధర్మపురి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణానికి చెందిన కాకుస్తం సూరమ్మ అనే మహిళను కత్తితో బెదిరించి ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారం గొలుసు అపహరించిన కేసులో నిందితురాలు గట్యాల మానసను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ ఉదయ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11న ఇంట్లో ఒంటరిగా ఉన్న సూరమ్మను గట్యాల మానస కత్తితో బెదిరించి బంగారు పుస్తెల తాడును అపహరించినట్లు ఆయన తెలిపారు. పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితురాలు మానసను గుర్తించి పట్టుకొని దొంగిలించిన బంగారు గొలుసు రికవరి చేసినట్లు ఆయన వివరించారు. కేసును 24 గంటల్లో ఛేదించిన ధర్మపురి, మల్యాల సీఐలు రాంనర్సింహారెడ్డి, నీలం రవి, ఎస్‌ఐ ఉదయ్‌కుమార్, ధర్మపురి పోలీస్ సిబ్బందిని ఎస్పీ అశోక్ కుమార్, డీఎస్పీ రఘుచందర్ అభినందించారు.

కిరాణా దుకాణంలో చోరీ

కొడిమ్యాల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడూర్‌లోని కిరాణా దుకాణంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని నిందితులు కిరాణం దుకాణం షట్టర్ కొంత బాగం పైకి లేపి లోపలికి చొరబడ్డారు. కౌంటర్‌లోని మూడు వేల రూపాయలను దొంగిలించారు. దుకాణం యజమాని నంది వెంకటేష్ ఫిర్యాదు మేకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్ సందీప్ తెలిపారు.

ఒకరికి తీవ్రగాయాలు

వీణవంక, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన యాసర్ల ఓదెలు అనే వ్యక్తిపై కుక్క దాడి చేయగా తీవ్రంగా గాయపడినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామస్థులు వెంటనే 108 సిబ్బందికి సమాచారం అందించారు. ఈఎంటీ ఐలవేని కుమారస్వామి, పైలెట్ ప్రశాంత్ అక్కడికి చేసుకుని ఓదెలుకు ప్రథమ చికిత్స చేశారు. అనంతరం హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఎత్తిపోతలు.. ఉత్తిపోతలేనా?

నిధులు లేక.. ప్రతిపాదన దశలోనే పథకం

- ప్రభుత్వం నిధులు విడుదల చేస్తేనే సాగు నీరు
- పూర్తయితే వేలాది ఎకరాలకు ప్రయోజనం

మల్యాల, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ఎత్తిపోతలలో వేలాది ఎకరాల సాగు భూములకు నీరందించాలనే ప్రతిపాదనలు నిధులు లేక ముందుకు వెళ్లడం లేదు. చెరువుల్లో నీరు లేక బావుల్లో భూగర్భ జలాలు అడుగంటడంలో ప్రతి ఏటా సాగు నీరు అందక రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మల్యాల మండలం మద్దుట్ల, గొర్రె గుండం, ఓగులాపూర్, నూకపల్లి తదితర గ్రామాలు వరద కాలువకు ఎగువన ఉండడంతో ఆయా గ్రామాల పరిధిలోని సుమారు 1500 ఎకరాలకు పైగా వ్యవసాయ భూములకు సాగు నీరు అందడం లేదు. వరదకాలువలో నీరు తగ్గినప్పుడల్లా బావుల్లోని నీరు అడుగంటి పోతోంది. మద్దుట్ల గ్రామం పక్క నుంచి దిగువ వైపు నుంచి వరదకాలువ వెలుతుంది. ఆ కాలువకు రైతులు భూములు కూడా కోల్పోయారు. అయినా వీరికి ప్రయోజనం లేకుండా పోయింది. ఈ క్రమంలో మద్దుట్ల శివారులోని వరదకాలువ 76.22కి.మీ వద్ద ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయాలని రైతులు ప్రతిపాదించారు.



ఎత్తిపోతల పంప్‌హౌజ్ ప్రతిపాదిత ప్రాంతం

● ఎత్తిపోతలకు ప్రతిపాదనలు

మద్దుట్ల శివారులో ఎత్తిపోతల పథకంతో పంప్‌హౌస్ ఏర్పాటు చేసి గ్రామ పరిధిలోని కొత్త చెరువు నింపడం ద్వారా సమీపంలోని గుడికుంట్ల చెరువును గ్రావిటీతో నింపడంతో పాటు అక్కడ అదనపు పంప్‌మోటారు ఏర్పాటు చేసి పంపింగ్ ద్వారా గొర్రెగుండంలోని నల్ల మట్టికుంటకు తరలించవచ్చు. ఈ నీటితో మద్దుట్ల కొత్త చెరువు, గుడికుంట, నల్ల మట్టికుంట, నూకపల్లిలోని అలుగుకుంట, రేగులకుంట, రాంపూర్‌లోని పాత, కొత్త చెరువులను కూడా నింపుకునే అవకాశం ఉంటుంది. దీంతో ఈ చెరువుల కిందవేలాది ఎకరాల సాగుభూములకు నీరందనుంది. ఇంతే కాకుండా గొల్లపల్లి, నూకపల్లి, రామన్నపేట, ముత్యంపేట, మల్యాల గ్రామాల పరిధిలో భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే మద్దుట్లతో పాటు సమీప ప్రాంతాల్లో సాగు నీరు లేకపోవడంతో ఏటా 70శాతం భూములు బీడుగా ఉంటుండడంతో గత కొన్నేళ్ల క్రితం కొందరు రైతులు వరదకాలువ నుంచి 1.5కి.మీ పైపులైన్ స్వంత ఖర్చులతో ఏర్పాటు చేసుకున్నారు. ఎత్తిపోతల గురించి ప్రజాప్రతినిధులు అధికారుల చుట్టూ తిరిగిన ప్రయోజనం లేకుండా పోతుందని ఈ ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వరదకాలువ ఎగువన సాగు చేసిన వరి పంటలు

● లిఫ్ట్‌లో..

కథలాపూర్ మండలం కలికోట సమీపంలో గల సూరమ్మ చెరువు లిఫ్ట్‌లో భాగంగా గత ప్రభుత్వం మద్దుట్ల ఎత్తిపోతలను చేర్చింది. ఇందుకు సుమారు రూ.700కోట్లతో ప్రతిపాదనలు రుపొందించిన అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. అందులో మద్దుట్ల లిఫ్ట్‌కు రూ.40కోట్లతో ప్రతిపాదించారు. అయితే బడ్జెట్ ఎక్కువ కావడంతో ముందుకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. రెండేళ్ల క్రితం జగిత్యాలకు వచ్చిన సీఎం కేసీఆర్ మద్దుట్ల ఎత్తిపోతల పథకం చేపడుతామని బహిరంగ సభలో ప్రకటించినా కార్యరూపం దాల్చలేదు.

వెంటనే చేపట్టాలి

- బి.మధుసూధన్‌రావు, మద్దుట్ల



మద్దుట్ల ఎత్తిపోతలను ప్రభుత్వం వెంటనే చేపట్టి రైతులకు సాగు నీరు అందించాలి. వరదకాలువ నుంచి ఎత్తిపోతలతో పాటు పంపింగ్ కూడా పరిశీలించి తగు చర్యలు చేపటితే ప్రత్యక్షంగా వందలాదిగా, పరోక్షంగా వేలాది ఎకరాలకు ప్రయోజనకరంగా మారి ఈ ప్రాంతం సశ్యశ్యామలం కానుంది.

రూ.4లక్షలు ఖర్చు అయ్యాయి

- మ్యాకల మహేశ్, మద్దుట్ల



వరదకాలువకు ఎగువన మద్దుట్ల వ్యవసాయ భూములు ఉండడంతో వందలాది ఎకరాలకు సాగు నీరందక పోగా వరదకాలువలో నీరు లేనప్పుడు సాగు చేసిన కొద్ది పంటలకు నీరందకపోవ డంతో వరదకాలువ నుంచి పైపులైన్ ఏర్పాటు చేసుకున్నాం.

నిధులు మంజూరు కాగానే పనులు

- సంతు ప్రకాశ్, ఈఈ

మద్దుట్ల ఎత్తిపోతలకు సంబంధించి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాము. నిధుల లేమితో ప్రతిపాదనలు తిరిగి పంపించారు. నిధుల లభ్యత, అందుబాటులో ఉన్నప్పుడు ప్రతిపాదనలు పరిశీలించాలని అందులో పేర్కొన్నారు. ఈఎన్‌సీ వద్ద కూడా దీనిపై ప్రతిపాదనలు ఉండడంతో ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే పనులు చేపడతాం.

కల్లోల కాలంలో జీవించిన కవి అలిశెట్టి

- ప్రెస్ అకాడమీ మాజీ అధ్యక్షుడు అల్లం నారాయణ



పురస్కారం అందుకున్న డాక్టర్ బెల్లి యాదయ్య

కరీంనగర్ కల్చరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కల్లోల కాలంలో జీవించిన కవి అలిశెట్టి ప్రభాకర్ అని ప్రెస్ అకాడమీ మాజీ అధ్యక్షుడు అల్లం నారాయణ అన్నారు. కరీంనగర్‌లోని ఫిలింభవన్‌లో ఆదివారం తెరవే ప్రధాన కార్యదర్శి దామరకుంట శంకరయ్య అధ్యక్షతన నిర్వహించిన అలిశెట్టి ప్రభాకర్ రాష్ట్ర స్థాయి పురస్కారం-2025 సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పురస్కారాన్ని నల్లగొండ జిల్లా కవి డాక్టర్ బెల్లి యాదయ్యకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అలతి అలతి పదాలతో అనంత అర్థాలను సృజించిన గొప్ప కవిత్వం అలిశెట్టిదని అన్నారు. ప్రజల పక్షం వహించి కవిత్వం అలిశెట్టి రాశారని చెప్పారు. అది ఎక్కువ ప్రసంగిత కల సాహిత్యమని అన్నారు. పురస్కార శాశ్వత ప్రదాత, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు మాట్లాడుతూ అలిశెట్టి స్ఫూర్తితో సమ సమాజ నిర్మాణం కోసం కృషి చేయాలని అన్నారు. అలిశెట్టి స్ఫూర్తిని, ఆకాంక్షలను వచ్చే తరాలకు అందించాలని కోరారు. డాక్టర్ బెల్లి యాదయ్య పరిచయాన్ని తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ బూర్ల వెంకటేశ్వర్లు చేశారు. కార్యక్రమంలో విలాసాగరం రవీందర్, మెరుగు ప్రవీణ్, గాజోజు నాగభూషణం, కొండి మల్లారెడ్డి, అన్నవరం దేవేందర్, కందుకూరి అంజయ్య, పీఎస్ రవీంద్ర, మమత వేణు, పెనుగొండ బసవేశ్వర్, సరసిజ, నసీరుద్దీన్, నడిమెట్ల రామయ్య, అన్నాడి గజేందర్‌రెడ్డి, డాక్టర్ బీవీఎన్ స్వామి, కొత్త అనిల్‌కుమార్, బాలసాని కొమురయ్య, ఎర్రోజు వేంకటేశ్వర్లు, ఇటిక్యాల రాము, కూకట్ల తిరుపతి, జనగాని యుగంధర్, గుడికందుల అరుణ్‌కుమార్, అఖిల్‌కుమార్, ఒడ్డేపల్లి రాజేశం, జిందం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

లోయలో దూకిన యువకుడు

మల్యాల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం వెనుకాల గల బేతాళ గుడి సమీపంలోని బండ రాయిపై నుంచి మల్యాలకు చెందిన మహిపాల్ అనే యువకుడు అనారోగ్యంతో భాధపడుతూ లోయలోకి దూకినట్లు స్థానికులు తెలిపారు. లోయలోకి దూకడాన్ని గమనించిన స్థానిక పోలీస్ అవుట్‌పోస్టు ఏఎస్సై చిలుక శ్రీనివాస్, పోలీసులు, హోంగార్డు మహిపాల్‌ను రక్షించే యత్నాలు చేశారు. ఇందులో ఏఎస్సై చిలుక శ్రీనివాస్ జారి పడి కిందపడి పోయారు. చేతికి గాయాలు అయ్యాయి. యువకుడిని బయటకుతీసి 108లో ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం కోలుకుంటున్నాడు.

రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు పతకాలు



రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో ఈనెల 4, 5, 6 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు విశేష ప్రతిభచాటి పలు పతకాలు సాధించారు. ఈ పోటీల్లో జిల్లా నుంచి పాల్గొన్న ఎల్ సత్య 30 సంవత్సరాల విభాగంలో రెండు బంగారు పతకాలు, కే శ్వేత బంగారు, కాంస్య పతకాలను సాధించారని జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పేర్యాల రవీందర్‌రావు, నీలం లక్ష్మణ్ తెలిపారు. 50 సంవత్సరాల విభాగంలో బి రాధ బంగారు, కాంస్య పతకాలను సాధించగా, పురుషుల విభాగంలో 30 సంవత్సరాల విభాగంలో ఎన్ శ్రీధర్ రజత పతకాలను, ఎల్ సుధాకర్‌రావు రజత పతకాన్ని, 40 సంవత్సరాల విభాగంలో పి ప్రసాద్‌గౌడ్ రజత పతకాన్ని, ఎం సంపత్ రజత పతకాన్ని, 45 సంవత్సరాల విభాగంలో ఏ అశోక్ రజత పతకాన్ని, 50 సంవత్సరాల విభాగంలో పి చంద్రశేఖర్ రజత, కాంస్య పతకాలను సాధించారని తెలిపారు. 60 సంవత్సరాల విభాగంలో పివి రామారావు బంగారు పతకాన్ని, 65 సంవత్సరాల విభాగంలో పి కిషన్‌రావు మూడు బంగారు పతకాలను, 80 సంవత్సరాల విభాగంలో ఏ ఐలయ్య రజత పతకాన్ని సాధించాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన క్రీడాకారులను డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, యోగా కోచ్ వి కిష్టయ్య, అథ్లెటిక్స్ కోచ్ నీలం పద్మ, రాజిరెడ్డి, వేల్పుల వెంకటేశ్, సుదర్శన్, తదితరులు అభినందించారు.

డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్‌తో గుల్బం శ్రీధర్

కోల్‌సిటీటౌన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలోని రామగుండం షైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ గుల్బం శ్రీధర్ గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ(అమెరికా) ఇటీవల మద్రాసు రాజా అన్నమలై మండ్రంలో జరిగిన కార్యక్రమంలో డాక్టరేట్ అందుకున్నారు. విద్యా వ్యవస్థలో గత 25 ఏళ్ళుగా ఉపాధ్యాయుడిగా, అధ్యాపకుడిగా, ప్రిన్సిపాల్‌గా ఎంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చి దిద్దినందుకు శ్రీధర్‌కు గౌరవ డాక్టరేట్‌ను అందజేశారు. శ్రీధర్ డాక్టరేట్ అందుకోవడంపై పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు అభినందనలు తెలిపారు.

కాలువకు గండి

- ఇళ్లలోకి చేరిన నీరు .. తడిచిపోయిన వస్తువులు
- అధికారులు సమస్య పరిష్కరించాలని ప్రజల వినతి



మన్నెంపల్లిలో కాలువకు పడిన గండి

తిమ్మాపూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని మన్నెంపల్లి గ్రామంలో డిస్ట్రిబ్యూటరీ 4 ఎడమ కాలువకు ఆదివారం తెల్లవారు జామున భారీ గండి పడింది. దీంతో కాలువ సమీపంలో ఉన్న ఎస్సీ కాలనీతో పాటు పలు కాలనీల్లోకి వరద నీరు చేరింది. ఇంట్లో నిలువ చేసుకున్న వంట సమన్లు, పప్పులు, బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులు తడిసి ముద్దయ్యాయని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. కొన్ని చోట్ల వస్తువులు వరద నీటిలో కొట్టుకుపోయాయి. వారం రోజుల క్రితం యాసంగి పంటలకు రైతులకు మిడ్‌మానేరు రిజర్వాయర్ నుంచి తోటపల్లి రిజర్వాయర్‌కు 300 క్యూసెక్కుల నీటి విడుదల చేశారు. ఇందులో సైదాపూర్‌కు 150 క్యూసెక్కులు, డిస్టిబ్యూటర్ 4 ఎడమ కాలువకు 150 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ రెండింటికి కలిపి పీచుపల్లి వద్ద రెగ్యులేటర్ ఉంది. గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి సైదాపూర్‌కి వెళ్లే కాలువను పూర్తిగా మూసి వేశారు. దీంతో అటువైపు వెళ్లే వరద నీరు డిస్టిబ్యూటరీ 4 ఎడమ కాలువ వైపునకు మళ్లింది. నీటి ప్రవాహం పెరగడంతో మన్నెంపల్లి గ్రామం వద్ద కాలువకు భారీగా గండి పడింది. గండి పడ్డ ప్రాంతం నుంచి సమీపంలో ఉన్న మన్నెంపల్లిలోని పలు గ్రామాల్లోకి పెద్ద ఎత్తున వరద నీరు వచ్చింది. ఒక్కసారిగా నీరు రావడంతో గ్రామస్థులు భయందోళనకు గురయ్యారు. స్థానికులు అధికారులకు సమాచారం అందించడంతో తోటపల్లి రిజర్వాయర్ నుంచి విడుదల అవుతున్న నీటిని తగ్గించారు. పీచుపల్లి వద్ద ఉన్న రెగ్యులేటరీ గేట్లు ఎత్తడంతో నీరు సైదాపూర్ వైపునకు మరలాయి. దీంతో మన్నెంపల్లిలో గండి వద్ద నీటి ఉధృతి తగ్గింది.



వంట గదిలోకి చేరిన నీరు

నాలుగు సార్లు గండి..



కాలువకు గండి పడి ఇళ్లల్లోకి నీళ్లు వచ్చాయి. దీంతో బియ్యం బస్తులు, కారం పోడి, ఉప్పు, పప్పు, మందు బస్తాలు తడిచి పోయా యి. ఇప్పటికైనా అధి కారులు మరమ్మతు చర్యలు తీసుకోవాలి.

- కనకవ్వ, మన్నెంపల్లి

ఇంట్లోని వస్తువులు తడిచిపోయాయి..



కాలువకు గండి పడి ఉదయం ఇంట్లోకి నీళ్లు రావడంతో వస్తువులు తడిచిపోయాయి. మమ్మల్ని పట్టించుకొనే వారే కరువయ్యారు. బి య్యం, ఉప్పు, పప్పులు నీటిలో కొట్టుకు పోయాయి.

- తిరుపతి, మన్నెంపల్లి

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

తిమ్మాపూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నెంపల్లి గ్రామంలో కెనాల్ డి-4 కాలువకు ఆదివారం గండి పడిన సంఘటనలో బాధత కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హామీ ఇచ్చారు. కాలువకు గండి పడిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హుటాహుటిన మన్నెంపల్లి గ్రామానికి బయలుదేరి వచ్చారు. కాలనీల్లో దారుల్లోను గుండా ప్రవాహిస్తున్న నీటిలో నుంచి ఎమ్మెల్యే నడుచుకుంటు పలు ప్రదేశాలను సందర్శించి పరిశీలించారు. అనంతరం గండి పడ్డ ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. అందుకు గల కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇమ్మెల్యే వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోరపల్లి రమణ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎస్.ఎల్.గౌడ్, మాజీ సర్పంచ్ మేడి అంజయ్య, నాయకులు తూముల శ్రీనివాస్, పోతుగంటి శ్రీనివాస్, గడ్డం శ్రీనివాస్, ఇతర నాయకులు పాల్గొన్నారు. వరద నీరు తగ్గించేందుకు రావుల క్రిష్టా చేసిన కృషికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అభినందించి సన్మానించారు

- పూడ్చివేత పనులు ప్రారంభం

తిమ్మాపూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): డి-4కాలువకు 9కిలోమిటర్ వద్ద ఆదివారం గండి పడి గ్రామంలోకి నీరు వచ్చిన సంఘటనలో సాయంత్రం ఇరిగేషన్ అధికారులు యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభించారు. ఈ గండి పడిన ప్రదేశాన్ని ఇరిగేషన్ ఈఎస్సీ శంకర్, ఎన్ఈ సుమతి దేవి, ఈఈ పెద్ది రమేష్, డీఈఈ సదయ్య పరిశీలించారు. తోటపల్లి రిజ ర్వాయర్ నుంచి కాలువకు వస్తున్న నీటిని పూర్తిగా నిలిపివేసినట్లు తెలిపారు.



నీట మునిగిన ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

ఈత సరదా కారాదు విషాదం..

- యువకులూ... జర భద్రం....
- సెలవుల్లో జాగ్రత్త

కరీంనగర్ క్రైం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఈత సరదా కొన్ని సందర్భాల్లో విషాదంగా మారుతోంది. పండగ సెలవుల్లో యువకులతోపాటు వారి కుటుంబ సభ్యులు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. కొండ పోచమ్మసాగర్‌లో శనివారం ఐదుగురు యువకులు నీటి మునిగి మృత్యువాత పడిన ఘటన ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ నేపథ్యంలో మన జిల్లాలోని జలాశయాలు, చెరువులు, కుంటల వద్ద భద్రతను అధికారులు పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది. సంక్రాంతి పండగకు అన్ని విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవులు ఇచ్చారు. విద్యార్థులు, యువకులతోపాటు పెద్దలు కూడా ఈత కొట్టేందుకు సరదాపడి స్థానికంగా ఉన్న జలాశయాలు, చెరువులు, కుంటలలోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తారు. ఈత రాకున్నా జలాశయాలు, చెరువుల్లో నీటి చివర కొంతదూరం వరకు వెళ్లి లోతు లేదని ఈత కొట్టేందుకు, స్నానం చేసేందుకు ప్రయత్నిస్తారు. ఆ జలాశయాలలో, చెరువులు, కుంటలలో నీటి అడుగున గుంతలను గమనించక మునిగిపోయి గల్లంతవుతుంటారు. కరీంనగర్ శివారులోని మానేరు జలాశయం ప్రస్తుతం పూర్తి సామర్థ్యంతో నీటితో నిండింది. జిల్లాలోని చెరువులు, కుంటలు నిండుకుండల్లా ఉన్నాయి. సెలవులకు పట్టణాల నుంచి గ్రామాలకు వచ్చిన పిల్లలు ఈత సరదాకు జలాశయాలు, చెరువుల వైపు వెళ్ళకుండా తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు.

● కనీస రక్షణ చర్యలు కరువు

2015 మే 25న కరీంనగర్ శివారులోని మానేరు జలాశయంలో ఆరుగురు విద్యార్థులు నీటి గుంతలో మునిగి మృతి చెందారు. రెండు కుటుంబాలలో ఇద్దరేసి కొడుకులు మృత్యువాత పడగా ఇందులో ఒక కుటుంబానికి చెందిన కవలపిల్లలున్నారు. హైదరాబాద్‌లో చదువుతున్న పిల్లలు వేసవి సెలవులకు కరీంనగర్‌కు వచ్చి మృత్యువాత పడిన సంఘటనల అందరిని కలచివేసింది. ఈత, స్నానానికి భారీ సంఖ్యలో ప్రజలు వస్తున్న విషయం తెలిసినా ప్రాజెక్టు అధికారులు ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాల్లో కంచెను సూచికలు ఏర్పాటు చేయక పోవడంతో ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయి. దిగువ మానేరు జలాశయం వద్ద పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి ఇదివరకు లష్కర్లు, వాచ్‌మెన్, సూపర్‌వైజర్‌లు 30 మంది వరకు పనిచేసేవారు. ఇప్పుడు వారెవరూ కనపడటంలేదు. లేక్ అవుట్‌పోస్ట్‌లో కానిస్టేబుల్, హోంగార్డులు మాత్రమే ప్రస్తుతం పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు.



ఆర్‌టీఏ మెంబర్‌గా పడాల రాహుల్

కరీంనగర్ అర్బన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రీజనల్ ట్రాన్స్‌పోర్టు అథారిటీ(ఆర్‌టీఏ) మెంబర్‌గా పడాల రాహుల్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆశీర్వాదంతో 2008లో ఎన్ఎస్‌యూఐలో రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన రాహుల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేశారు. రాహుల్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్‌రెడ్డి తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

గొలుసు అపహరణకు యత్నం

మల్యాల, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పొలం పనులకు వెళ్లిన మహిళ రైతు మెడలో నుంచి గొలుసు అపహరణకు ఇద్దరు యువకులు ఆదివారం యత్నించారు. మండలంలోని రామన్నపేటకు చెందిన వెల్మ సుగుణమ్మ అనే వృద్ధురాలు పొలం పనుల్లో భాగంగా పంప్‌మోటార్ స్టార్ట్ చేసి వస్తుండగా ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆమె మెడలో నుంచి గొలుసు అపహరణకు యత్నించారు. ఆమె అరవడంతో ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై నుంచి పరారీ అయ్యాడు. మరో వ్యక్తి పొలంలో నుంచి పరుగెత్తుకొని వెళ్లడంతో సమీపంలో గల రైతులు వెంబడిచ్చి పట్టుకున్నారు. ఆయన ఇచ్చిన సమాచారం మేరకు వాహనంపై నుంచి పరారీ అయిన వ్యక్తిని పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పట్టుబడిన ఇద్దరిపై కేసు నమోదు చేసి పోలీసులు విచారిస్తున్నారు.

పేకాటరాయుళ్లు అరెస్టు

కాల్వశ్రీరాంపూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కూనారం గ్రామశివారులో శనివారం రాత్రి పేకాట ఆడుతుండగా ఎస్సై వెంకటేష్ సిబ్బందితో కలిసి వెళ్లి ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. వారి నుంచి 41,670 రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా, మరికొందరు పారి పోయినట్లు ఎస్సై తెలిపారు. గ్రామాల్లో పేకాడుతున్నట్లు గమనిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

చెరకు వేద్దామా.. వద్దా

సాగుపై అన్నదాత సందిగ్ధం

- నిజాం షుగర్స్ పునరుద్ధరణపై ఇంకా రాని స్పష్టత
- ఈ యేడాది డిసెంబరులో ఫ్యాక్టరీ నడవాలంటే చెరకు సాగు కీలకం
- చెరకు సాగుకు ప్రయత్నాలు
- జగిత్యాల జిల్లాలో కేవలం 1,200 ఎకరాల్లోనే చెరకు



జగిత్యాల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నిజాం షుగర్స్ కర్మాగారాల పునరుద్ధరణలో అత్యంత కీలక అంశమైన చెరకు సాగులో రైతులు సందిగ్ధంలో ఉన్నారు. లే ఆఫ్‌తో మూసివేసిన జగిత్యాల జిల్లా ముత్యంపేట, నిజామాబాద్ జిల్లా బోధన్, మెదక్ జిల్లా ముంబోజుపల్లి కర్మాగారాలను ఈ యేడాది డిసెంబరులో పునరుద్ధరిస్తామని ప్రభుత్వ పెద్దలు పలు సందర్భాల్లో ప్రకటించారు. ఇందుకోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో మంత్రి శ్రీధర్‌బాబు నేతృత్వంలో యేడాది క్రితం సబ్ కమిటీని కూడా ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులను కర్మాగారాలను సందర్శించి రైతుల అభిప్రాయాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. సంబంధిత నివేదిక ఆధారంగా ప్రైవేటు యాజమాన్యం పరిధిలో గల ఈ ఫ్యాక్టరీలకు చెందిన సుమారు రూ. 400 కోట్ల బ్యాంకు అప్పులను రాష్ట్ర ప్రభుత్వం వన్‌టైం సెటిల్‌మెంట్ కింద విడతల వారీగా రూ. 190 కోట్లు చెల్లించి రుణవిముక్తి కల్పించింది. ఫ్యాక్టరీల పునః ప్రారంభం విషయంలో ప్రభుత్వం మరింత వేగంగా ముందుకు వెళ్తుందని రానున్న క్రషింగ్ సీజన్ డిసెంబరు నాటికి తెరిపిస్తామని ప్రభుత్వ పెద్దలు అంటున్నారు. ఫ్యాక్టరీ నడవాలంటే ప్రధాన ముడిసరుకు అయిన చెరకు కీలకంగా ఉంటుంది. ఇప్పటి నుంచే సాగు ప్రారంభిస్తే క్రషిం గ్ సీజన్ ప్రారంభం నాటికి చేతికి వచ్చే వీలుంటుంది. ఆ దిశగా జిల్లాలో ప్రయత్నాలు జరగడం లేదు.

పూర్వ వైభవంపై ఆశలు..



నిజాం షుగర్స్ యూనిట్లను 2002 సంవత్సరంలో డెల్టా పేపర్ మిల్స్ అనే ప్రైవేటు కంపెనీకి అప్పటి ప్రభుత్వం విక్రయించింది. 2014 ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ నిజాం షుగర్స్‌ను ప్రభుత్వ పరం చేస్తామని ప్రకటించారు. 2015 డిసెంబరు 23వ తేదీన బోధన్, ముత్యంపేట, ముంబోజుపల్లి యూనిట్లలో లే ఆఫ్ ప్రకటించి మూసివేశారు. దీంతో చెరకు రైతులు ఇతర పంటల వైపు మళ్లారు. నిజాం షుగర్స్‌ను తెరిపిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా హామీనిచ్చింది. ఆ దిశగా ప్రయత్నాలు చేస్తూ రానున్న క్రషింగ్ సీజన్ డిసెంబరు నాటికి తెరిపిస్తామని అంటోంది. ఫ్యాక్టరీ ప్రారంభిస్తే ఈ ప్రాంతంలో ఆర్థిక ఆదాయం పెరుగుతుందని పలువురు అంటున్నారు. రైతుల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేసి చెరకు సాగు ప్రోత్సహించడంతో పాటు ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అన్నదాతల్లో పలు సందేహాలు..

దాదాపుగా తొమ్మిదేళ్లుగా మూతపడిన ఫ్యాక్టరీలు నడవాలంటే మిషనరీల మరమ్మతు, కొత్త మిషనరీలను ఏర్పాటు చేయడం జరగాలని, ఇప్పటివరకు వీటికి ప్రభుత్వం ఒక్క రూపాయి విడుదల చేయలేదని, ఇలాంటి పరిస్థితుల్లో ఎలా నమ్ముతామని రైతులు అంటున్నారు. ఫ్యాక్టరీని ప్రైవేటురంగంలో నడిపిస్తారా...? ప్రభుత్వం నడిపి స్తుందా.. లేకుంటే సహకా ర విధానంలో నడిపి స్తారా అనే విషయం ఇంకా తేలలేదని రైతులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. గతం లో ముత్యంపేట కర్మాగారంలో సీజన్‌కు 2.50 లక్షల టన్నుల మేరకు చెరకు గానుగాడించే వారు. సుమారు 10 నుంచి 15 వేల ఎకరాల్లో పంట సాగు చేసేవారు. ప్రస్తుతం జిల్లాలో కేవలం సు మారు 1,200 నుంచి 1,500 ఎకరా ల్లోపు మాత్రమే చెరకు సాగు చేస్తున్నారు. రైతులు వరి సాగు వైపు మళ్లారు. ఫ్యాక్టరీ తెరిస్తే చెరకు సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది.

రైతుల్లో అవగాహన కల్పించాలి

- అల్లూరి మహేందర్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్, జగిత్యాల జిల్లా



చెరకు సాగు అవసరాలపై రైతుల్లో అవగాహన కల్పించాలి. దీర్ఘకాలిక పంట అయిన చెరకు రానున్న క్రషింగ్ సీజన్ వరకు చేతికి రావాలంటే ఇప్పటి నుంచే సాగు ప్రారంభించాలి. రైతుల సందేహాలను అధికారులు నివృత్తి చేసి సాగుకు ప్రోత్సహించాలి. ప్రభుత్వ సంకల్పం మేరకు ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం అటు రైతులు, ఇటు అధికారులు పరస్పర సహకారాలు అందించుకోవాలి.

పూర్వ వైభవం తీసుకురావాలి

- కొత్తపల్లి రాజిరెడ్డి, చెరకు రైతు, ఫ్యాక్టరీ చిట్టాపూర్ గ్రామం, జగిత్యాల జిల్లా



పూర్వ వైభవం రావడానికి చెరకు సాగును ప్రోత్సహించి ఫ్యాక్టరీ తరఫున రైతులతో ఒప్పందాలు జరగాలి. సబ్సిడీలు అందించాలి. మేలు రకమైన విత్తనాలు సరాఫరా చేయాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు పెంచాలి. మద్దతు ధరను ముందుగానే ప్రకటించాలి.

భారత ఖోఖో జట్టు అసిస్టెంట్ కోచ్‌గా నరేష్

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన జాతీయ ఖో-ఖో క్రీడాకారుడు, దక్షిణ మధ్య రైల్వే కోచ్ ఇస్లావత్ నరేష్ భారత మహిళల ఖో-ఖో జట్టుకు అసిస్టెంట్ కోచ్‌గా ఎంపికయ్యాడు. ఈనెల 13 నుంచి 19వ తేదీ వరకు ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరిగే మొదటి ఖో-ఖో ప్రపంచకప్ పోటీల్లో పాల్గొనే భారత మహిళల జట్టుకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ధర్మారం మండలం బంజరుపల్లి తండాకు చెందిన ఇస్లావత్ నరేష్ అసిస్టెంట్ కోచ్‌గా విధులు నిర్వర్తించనున్నాడు. ఈ ప్రపంచ కప్‌లో ఖో-ఖో పోటీల్లో 26 దేశాల నుంచి 50 ఖో-ఖో జట్లు పాల్గొననున్నాయి. గత నెల రోజులుగా ఢిల్లీలో జరుగుతున్న భారత జట్ల శిక్షణ శిబిరాలలో భారత మహిళల జట్టుకు శిక్షణను అందించాడు. భారత మహిళల జట్టుకు ఢిల్లీకి చెందిన సుమిత్ భాటియా చీఫ్ కోచ్‌గా ఉండగా, నరేష్ అసిస్టెంట్ కోచ్‌గా విధులను నిర్వర్తించ నున్నాడు. నరేష్‌ను తెలంగాణ రాష్ట్ర ఖో-ఖో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జంగా రాఘవరెడ్డి, నాతి కృష్ణమూర్తి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఖో-ఖో సంఘ ప్రధాన కార్యదర్శి వై మహేందర్‌రావు, రాష్ట్ర ఖో-ఖో సంఘ రిఫరీస్ బోర్డు చైర్మన్ కేద సదానందం, కన్వీనర్ వంగపల్లి సూర్యప్రకాశ్, పెద్దపల్లి జిల్లా ఖో-ఖో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శు లు లక్ష్మణ్, డాక్టర్ వేల్పుల కుమార్, డా క్టర్ వేల్పుల సురేందర్, సీఐ కుమార స్వామి, , ఎస్ఐ రమేశ్, సీనియర్ ఖో-ఖో క్రీడాకారులు జలంధర్, గెల్లు మధుకర్, ఆనంద్ రాజు, రవీందర్, నవీన్‌కుమార్, కట్ట సంతోష్, తిరుపతి రెడ్డి తదితరులు అభినందించారు.



రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

రాజన్న సన్నిధిలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సంక్రాంతి సెలవుల నేపథ్యంలో భక్తుల తాకిడి పెరుగుతోంది. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు రాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు.

'పరిపాలనలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం'

పెద్దపల్లి కల్చరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ పరిపాలనలో విఫలమైందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ మేథోమదన సదస్సులో వ్యాపార నిపుణులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం తెలంగాణను శిథిలం చేసిందని ఆయన విమర్శించారు. ప్రతి ఒక్కరూ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దాసరి ఉష, పలువురు ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు, వ్యాపారులు పాల్గొన్నారు.



కౌశిక్‌రెడ్డి తీరును తీవ్రంగా ఖండిస్తున్నా..

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

కరీంనగర్ అర్బన్: ఉమ్మడి జిల్లా అభివృద్ధి కార్యాచరణ ప్రణాళికా సమావేశంలో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తీరును రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి, ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఏడు సార్లు ఎమ్మెల్యే, ఎంపీగా గెలిచిన సీనియర్ మోస్ట్ నాయకుడిగా తాను ఎన్నడూ ఇటువంటి ప్రవర్తన ఎక్కడా చూడలేదని అన్నారు. అధికారిక సమావేశానికి, రాజకీయాలకు సంబంధం లేదన్నారు. ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులందరినీ సమావేశానికి ఆహ్వానించామన్నారు. ఈ సందర్భంగా అందరిని మాట్లాడాలని కోరామని, కానీ ఒక ఎమ్మెల్యేను అడ్డుకుని రాజకీయ ప్రసంగం చేసి అనుచితంగా ప్రవర్తించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు.

గుండాయిజం, రౌడీయిజం చేస్తే ఊరుకోం...

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

ఉమ్మడి జిల్లా అభివృద్ధి సంక్షేమ పథకాలపై కార్యాచరణ రూపొందించేందుకు నిర్వహించిన సమావేశంలో అనుచితంగా ప్రవర్తించడం శోచనీయమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అనుచిత ప్రవర్తనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పేదలు, దళితుల అభివృద్ధికి ప్రభుత్వం ఏ విధంగా కార్యాచరణ రూపొందిస్తుందనేది చూశాక స్పందించాలని, కానీ అందుకు విరుద్ధంగా హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రవర్తన ఉందన్నారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నవారికి ఎన్నడూ అవకాశం ఇవ్వలేదని, ఆదివారం జరిగిన సమావేశంలో ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు కూడా మాట్లాడేందుకు అవకాశం కల్పించామన్నారు. దీన్ని అవకాశంగా తీసుకొని ఎమ్మెల్యే అనుచితంగా ప్రవర్తించడం సరైంది కాదన్నారు. పేదవారికి మేలు జరుగుతున్నప్పుడు ప్రభుత్వానికి అండగా నిలబడాలనే ఉద్దేశంతో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సహకరించేందుకు ముందుకు వచ్చారన్నారు. పోలీసులు కౌశిక్‌రెడ్డిని అదుపు చేసేందుకు యత్నించగా వారిపై కూడా ఎదురుతిరిగేలా వ్యవహరించాడని, గుండాయిజం, రౌడీయిజం చేస్తే ఊరుకోబోమని మంత్రి శ్రీధర్‌బాబు హెచ్చరించారు.

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకత్వం స్పందించాలి...

- మంత్రి పొన్నం ప్రభాకర్

హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అనుచిత ప్రవర్తనపై బీఆర్ఎస్ రాష్ట్ర నాయకత్వం కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు స్పందించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు సమర్థిస్తున్నారా? ప్రోత్సహిస్తున్నారా? ఆదర్శంగా తీసుకుని బూతు మాటలు నేర్పే స్కూల్ ఏమైనా పెట్టుకున్నారా అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ఇటువంటి ఘటన మంచి పద్ధతి కాదని, తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గతంలోనూ వ్యక్తిగతంగా బెదిరింపులకు పాల్పడ్డారని, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశంను కూడా బెదిరించారన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

- పథకాల అమలుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- ఉమ్మడి జిల్లా సమీక్షా సమావేశంలో ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యాచరణ ప్రణాళిక సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కరీంనగర్, జనవరి 12(ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): రాజకీయాలకతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కరీంనగర్ కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా కార్యాచరణ ప్రణాళిక సమీక్షా సమా వేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా ప్రజలందరికీ ప్రభుత్వ పథకాలు అందాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకం రాష్ట్రంలో అమలు చేస్తామన్నారు. పథకాల అమ లుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయానికి యోగ్యమైన భూమికి పంట వేసినా, వేయకపోయినా రైతు భరోసా కింద సంవత్సరానికి 12 వేల రూపాయలు అందిస్తామన్నారు. రోడ్లు, రియల్ ఎస్టేట్ స్థలాలు సాగుకు యోగ్యం కాని భుములకు రైతు భరోసా ఇవ్వబోమని స్పష్టం చేశారు. వ్యవసాయ కూలీలకు ఏడాదికి 12 వేల రూపాయలు అందిస్తామని తెలిపారు. అర్హులందరికీ రేషన్ కార్డులు ఇస్తామన్నారు. ఈ నెల 26 నుంచి రేషన్ కార్డుల పంపిణీ మొదలవుతుందన్నారు. తెలంగాణలో గత ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ముందు 90 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులు ఉండేవని, అధికారంలోకి వచ్చాక 49 వేల కొత్త కార్డులు మాత్రమే ఇచ్చారని తెలిపారు. వచ్చే నెల నుంచి ఆరు కిలోల సన్న బియ్యాన్ని అందిస్తామన్నారు. కాళేశ్వరం నుంచి నీరు ఎత్తిపోయకుండానే రాష్ట్ర వ్యాప్తంగా 66.7 లక్షల ఎకరాల్లో 155 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండిందన్నారు. జిల్లాలో అర్హత ఉన్న ప్రతి వ్యక్తికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలోని రోళ్లవాగు, పత్తిపాక, పాలకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇళ్లు మంజూరు చేయబోతున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో మధ్యలో వదిలేసిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను కూడా పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సమన్వయంతో సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచిం చారు. అర్హత ఉన్న ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డు, యోగ్యతగల ప్రతి రైతుకు రైతు భరోసా అందజేయాలన్నారు. లబ్దిదారుల గుర్తింపులో అప్రమ త్తంగా ఉండాలని తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలులో ఏవైనా ఆటంకాలు కలిగించినా, అధికారులపై దాడులు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసాతో రూ. 12 వేలు..

- మంత్రి పొన్నం ప్రభాకర్



వ్యవసాయదారులకు రైతు భరోసా తో పాటు వ్యవసాయ కూలీ లకు కూడా ఇంది రమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా 12 వేలు అందజేస్తున్న ఏకైక ప్రభుత్వం తమ దేనని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. పేదల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నామని, ప్రతి కుటుంబానికి రేషన్‌కార్డు అంద జేస్తామని తెలిపారు. పక్షపాతం లేకుండా ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేస్తా మని అన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, విజయరమ ణారావు, మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్, సంజయ్‌కుమార్, గంగుల కలామకర్, పాడి కౌశిక్‌రెడ్డి, ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆదిశ్రీనివాస్, ఎమ్మెల్సీలు జీవన్‌రెడ్డి, ఎల్ రమణ, భాను ప్రసాదరావు, మేయర్ సునీల్‌రావు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కరీంనగర్ గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశం, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, కలెక్టర్లు సందీప్‌కుమార్ ఝూ, కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, అరుణశ్రీ, అఖిల్ మహాజన్, లక్ష్మీకిరణ్, అబ్దుల్ అజీజ్, భీమ్యానాయక్, వేణు, బీఎస్ లత పాల్గొన్నారు.

సంజయ్‌కుమార్ X కౌశిక్‌రెడ్డి



ఎమ్మెల్యేలు సంజయ్, కౌశిక్‌రెడ్డి మధ్య వాగ్వాదం

బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ మధ్య జరిగిన వాగ్వాదం, తోపులాట కారణంగా సమీక్షా సమావేశం రసాభాసగా మారింది. సమావేశంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ మాట్లాడడానికి మైకు తీసుకోగా హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అభ్యంతరం చెప్పారు. ఆయన ఏ పార్టీకి చెందిన వ్యక్తి, ఎందుకు మాట్లాడడానికి అవకాశం ఇస్తున్నారంటూ ప్రశ్నించి ఆయనపైకి దూసుకువెళ్లే ప్రయత్నం చేశారు. దానికి డాక్టర్ సంజయ్‌కుమార్ దీటుగా స్పందించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆయనకు అండగా నిలిచి నువ్వు ఏ పార్టీ నుంచి వచ్చావు అంటూ కౌశిక్‌రెడ్డిని ప్రశ్నించారు. ఈ సందర్భంలోనే మాటా మాట పెరిగి ఒకరిని ఒకరు తోసివేసుకుంటూ వ్యక్తిగత దూషణలకు దిగారు. ఈ లోగా పోలీసులు జోక్యం చేసుకుని కౌశిక్‌రెడ్డిని బయటకు తీసుకువెళ్లారు. గేటు బయటనే నిలబడిన కౌశిక్‌రెడ్డి సిగ్గూ..లజ్జా ఉంటే రాజీనామా చేసి మళ్లీ గెలవమని సంజయ్‌కుమార్‌కు సవాల్ విసిరారు. సమావేశంలో కౌశిక్‌రెడ్డి వ్యవహరించిన తీరుపై మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ తీవ్ర అసహనం అగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వ్యవహారం సరిగా లేదని మార్చుకోవాలని హెచ్చరించారు. తనను విమర్శించడానికి, రాజీనామా చేయమని అడగడానికి కౌశిక్‌రెడ్డికి ఎలాంటి అధికారం లేదని డాక్టర్ సంజయ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌశిక్‌రెడ్డిమీద స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తానని చెప్పారు.

సంజయ్‌కుమార్ కాంగ్రెస్ బీఫాంపై పోటీ చేసి గెలిచి చూపించాలి

- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు దమ్ముంటే కాంగ్రెస్ బీఫాంపై పోటీ చేసి గెలిచి చూపించాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సవాల్ విసిరారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండు సీజన్లలో రైతు భరోసా ఇవ్వలేదని, ఈ విషయంపై ఉమ్మడి జిల్లా రైతుల పక్షాన, తెలంగాణ రైతుల పక్షాన తాము అడుగుతున్నామని అన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో వంద శాతం రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 18,500 కుటుంబాలకు దళితబంధు ఇచ్చామని, రెండో విడత దళితబంధును ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు. కచ్చితంగా దళితబంధు విడుదల చేయాలని తాను చెప్పానని, ఇవన్నీ అడిగితే ముగ్గురు మంత్రులు, ఎమ్మెల్యేలు మందబలం ఉందని బెదిరించే ప్రయత్నం చేశారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేసేవరకు ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. అధికారులు ఇష్టం వచ్చినట్లు చేస్తున్నారని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఎవరినీ వదిలి పెట్టబోమని హెచ్చరించారు.

కాంగ్రెస్‌లోనే ఉన్నా.. కాంగ్రెస్ ఎమ్మెల్యేగా కొనసాగుతా..

- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్



కరీంనగర్ అర్బన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌లోనే ఉన్నానని, ఆ పార్టీ ఎమ్మెల్యేగా కొనసాగుతానని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ స్పష్టం చేశారు. కరీంనగర్‌లో ఆదివారం జరిగిన ఉమ్మడి జిల్లా సమావేశంలో జరిగిన ఘటనపై ఆయన ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ప్రవర్తన పలుమార్లు చూశామని, తోటి ఎమ్మెల్యేలపై అన్ పార్లమెంటరీ వ్యాఖ్యలు మాట్లాడుతున్నాడని అన్నారు. కరీంనగర్‌లో ఆదివారం జరిగిన అధికారిక కార్యక్రమంలో పాల్గొన్న తనను ఏ పార్టీ అని కౌశిక్‌రెడ్డి అడిగాడన్నాడు. తప్పకుండా కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నానని, జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధికి కలిసి పనిచేస్తానని సంజయ్‌కుమార్ అన్నారు. తనపై కౌశిక్‌రెడ్డి అరవడానికి వచ్చినప్పుడు మిగతా కాంగ్రెస్ శాసనసభ్యులు, మంత్రులు అందరూ నాకు అండగా వచ్చారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులు కూడా అతన్ని పద్ధతి కాదని పక్కకు తీసుకువెళ్లారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ గతంలో సీపీఐ, బీఎస్పీ, టీడీపీ, కాంగ్రెస్‌లకు చెందిన నాయకులను కలుపుకుందని, ఫిరాయింపుల గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదన్నారు. మాది మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ కుటుంబమేనని సంజయ్‌కుమార్ అన్నారు. తనకు అవకాశాలు రాక కాంగ్రెస్ పార్టీలోకి రాలేదని, సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులతో కలిసి జగిత్యాలను అభివృద్ధి చేసుకుంటానని ఆయన తెలిపారు. రోడ్ల వెంట వెళ్తుంటే కుక్క మొరిగినట్లు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఏదో అరిచాడని, దానికి అంత ప్రాధాన్యం ఇవ్వనని సంజయ్‌కుమార్ స్పష్టం చేశారు.

న్యూస్ బాక్స్

కేశోరాంలో బిర్లా జయంతి

పాలకుర్తి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): బసంత్‌నగర్ కేశోరాం సిమెంటు కంపెనీ అధిపతి బసంత్‌కుమార్ బిర్లా జయంతిని ఆదివారం కంపెనీ ఆవరణలో ఘనంగా జరుపుకున్నారు. ప్లాంట్ హెడ్ శ్రీనివాస రెడ్డి,హెచ్ఆర్ హెడ్ పి ప్రార్థసారది, అకౌంట్స్‌హెడ్ రామచంద్ర త్రిపాఠి, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది, కార్మికసంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఓదెల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మడక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆదివారం 'మన మడక క్యాలెండర్'ను జాతీయస్థాయి అవార్డుగ్రహీత, మంథని మండలం నాగారం మాజీ సర్పంచ్ బూడిద మల్లేశం ఆవిష్కరించారు. అనంతరం మొదటి క్యాలెండర్‌ను పారిశుధ్య సిబ్బందికి బహూకరించారు. కార్యక్రమంలో క్యాలెండర్ రూపకర్త నేముల శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి అజ్మీర జ్యోతి, గ్రామపంచాయతీ శిక్షణ నిపుణులు కోట సురేందర్‌రెడ్డి, మాజీ సర్పంచు కొమురయ్యగౌడ్, మాజీ ఎంపీటీసీలు రాపోలు హనుమంతరావు, ఆవుల ముత్తయ్య, నేహా కాన్సెప్ట్ స్కూల్ చైర్మన్ పల్నాటి దేవేందర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ నందా క్రాంతి కుమార్, పాల సంఘం చైర్మన్ గుడిపాటి కేశవరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు శ్రీకాంత్‌గౌడ్, నేముల ఇంద్రారెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి గోశిక రాజేశం పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్‌కు పురస్కారాలు

కమాన్‌పూర్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరిగిన లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ రీజియన్ మీట్‌లో కమాన్‌పూర్ లయన్స్ క్లబ్‌కు 8 పురస్కారాలు అందుకున్నట్లు అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కమాన్‌పూర్ ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శంకర్, సభ్యులు లయన్ ఇనగంటి భాస్కరరావు, లయన్ లగిశెట్టి చంద్రమౌళి, లయన్ సొప్పరి సంతోష్‌కుమార్, లయన్ జబ్బర్‌ఖాన్, సదాశయ జాతీయ ప్రధాన కార్యదర్శి లయన్ చోడవరపు లింగమూర్తిలు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

మంథనిరూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరయ్యపల్లిలో సంక్రాంతి పండగ సందర్భంగా ఆదివారం సూరయ్యపల్లి ప్రిమియర్ లీగ్-7 క్రికెట్ పోటీలను ప్రారంభించారు. టోర్నమెంట్‌లో విజేతకు బహుమతిని ఆకుల చంద్రశేఖర్-మౌనిక, రన్నరప్‌కు బహుమతిని ఆర్ల నాగరాజు, పీల్దుల ఆరెల్లి కిరణ్‌గౌడ్‌లు స్పాన్సర్ చేస్తారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు భీముని వెంకటస్వామి, బూడిద శంకర్, మంథని సత్యం, కర్ణ కృష్ణ, ఎరుకల ప్రవీణ్‌లు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ కోఆర్డినేటర్‌గా అల్లంకి లచ్చయ్య..

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 12(ఆంధ్రజ్యోతి): వాసవి క్లబ్ ఇంటర్నేషల్ కోఆర్డినేటర్‌గా అల్లంకి లచ్చయ్య ఎంపికయ్యారు. మాజీ సింగరేణి ఉద్యోగి అయిన లచ్చయ్య 2025 సంవత్సరానికి నూతన కమిటీని ఎంపిక చేయగా, కోఆర్డినేటర్‌గా ఎంపికయ్యారు. లచ్చయ్య ఎంపిక పట్ల కాలనీ ఆర్యవైశ్య మహాసభ పట్టణ అధ్యక్షుడు అనంతుల రాజు హర్షం వ్యక్తం చేస్తున్నట్టు ప్రకటనలో పేర్కొన్నారు.

ఆధ్యాత్మిక ప్రచారం

పెద్దపల్లి రూరల్, జనవరి 12: (ఆంధ్రజ్యోతి): భగవద్గీత ప్రచారంలో భాగంగా పెద్దపల్లి మండలంలోని భోజన్నపేటలో హిందూ జ్ఞాన వేదిక ఉత్తర తెలంగాణ కమిటీ ఆధ్వర్యంలో ధర్మ ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక తెలంగాణ కమిటీల అధ్యక్షులు సభ్యులు సాయిశంకర్, నిరంజన్,రాజు, రవీందర్ రెడ్డి,దేవేంద్ర, పంచాక్షరి, నాగిరెడ్డి,సతీష చారి, సాయి వెంకట్, రాహుల్‌లతా, ధనలక్ష్మి, శ్రీదేవి,జ్యోతి చంద్రవ్వ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాలు లేక ఇబ్బందులు..

ధర్మారం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ బ్రిడ్జి సమీపంలో వీధిదీపాలు లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు చీకటిగా ఉండడం, బ్రిడ్జి పక్కన ఫుట్‌పాత్ ఉండడం ప్రమాదాలకు కారణమవుతోంది. బ్రిడ్జి పక్కన ఉన్న విద్యుత్ స్థంభం లైట్ ఆరు, ఏడు నెలల నుంచి వెలగడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు లైట్ అమర్చాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలు



ఖనిలో నివాళులర్పిస్తున్న కందుల సంధ్యారాణి



మంథనిలో నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రమ



పెద్దబొంకూరులో పూలమాల వేస్తున్న యువకులు

కోల్‌సిటీటౌన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఆదివారం గోదావరిఖనిలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ రామగుండం నియోజకవర్గ ఇంచార్జీ కందుల సంధ్యారాణి, నాయకులు వెంకటరమణ, కోడూరి రమేష్, భూమన్న, సతీష్, తడగొండ నర్సన్న, నరసింహారెడ్డి, రవి, సత్యనారాయణ, ప్రవీణ్, ఆకాష్, రాకేష్, శ్రీనివాస్, పద్మ, అపర్ణ, ఏబీవీపీ విభాగ్ హాస్టల్స్ కన్వీనర్ రాసురి ప్రవీణ్ స్వామి, గొట్టె ఉదయ్, దేగాంబర్, పవన్, రవి, కిరణ్,సాయితేజ, మురారి, వంశీ, కార్తీక్ పాల్గొన్నారు.

● కాల్వశ్రీరాంపూర్ (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు చిలువేరు సంపత్‌కుమార్, పురెల్ల దిలీప్, ఉప్పుల కుమార్, సిరిపురం రమేష్, శ్రీనివాస్, సాయి, చల్ల శ్రవణ్, దుస్త సాయి, ఉమ్మడి వేణు, అనిల్, తాటికొండ శ్రావణ్, కాంత్రి, శంకర్ పాల్గొన్నారు.

●ఎలిగేడు (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ యువజన కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, తాటిపల్లి రమేష్‌బాబు, అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, బూర్ల వెంకటసత్యం, పడాల పర్శరాంగౌడ్, పెద్దపల్లి దేవరాజ్, బాలసాని పర్శరాంగౌడ్, కొండ తిరుపతిగౌడ్, పుల్లారావు, కట్ల సత్యనారాయణ, వీరగోని లక్ష్మీనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● పెద్దపల్లి రూరల్ (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దబొంకూరులో మిట్టపల్లి శ్రీనివాస్, కలవేన రవి, వెంకటేష్, సాగర్, కలవేన రాయమల్లు, తోటపల్లి గణేష్, అవినాష్, అక్షయ్, కారుపాకల బన్నీ, నిఖిల్, మధునయ్య, సత్యనారాయణ, రాజేశం, తిరుపతి పాల్గొన్నారు.

● యైటింక్లయిన్‌కాలనీ (ఆంధ్రజ్యోతి): కాలనీలో శివాజీ యూత్ సభ్యులు, ఏబీవీపీ కార్యకర్తలు అయిలవేని అనిల్, రామంచి శ్రావణ్, విక్కీ, నవీన్, ఈశ్వర్ నాయక్, అనిల్‌కుమార్, అరుణ్, ప్రసాద్, కిరణ్, సాయికుమార్ పాల్గొన్నారు. ఈవీఎస్ ఎన్‌జీఓ ఆధ్వర్యంలో ఇరికి మహేష్, బాదె రాజలింగం, మడిపల్లి సాగర్, వెంకటస్వామి, ముజామిల్, బాలయ్య, సత్తయ్య పాల్గొన్నారు.

●మంథని (ఆంధ్రజ్యోతి): మంథని మున్సిపల్ కార్యాలయంలో, స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి, వైస్‌చైర్మన్ బానయ్య, కౌన్సిలర్లు రవి, లక్ష్మి, నక్క శంకర్, కొట్టె రమేష్‌లు, తగరం శంకర్‌లాల్, మాచీడి రాజుగౌడ్, బెల్లకొండ ప్రకాష్‌రెడ్డి, ఆకుల రాజబాబు, కనవేన శ్రీనివాస్, మంథని లక్ష్మణ్, ఇర్ఫాన్, ఆసీఫ్, బెజ్జంకి డిగంబర్, సబ్బని సంతోష్, చిలువేరి సతీష్, బోగోజు శ్రీనివాస్, నారమల్ల కృష్ణలు పాల్గొన్నారు.

● జూలపల్లి (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంతో పాటు పెద్దాపూర్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు కొప్పుల మహేష్, కొప్పుల మహేష్, నాయకులు గుడిపాటి సంతోష్‌రెడ్డి, కంకనాల జ్యోతిబసు, మెరుగు రమేష్, కొమ్మ ఐలయ్య, ఆవుల రాజు, దీకొండ అంజనేయులు, కోడూరి రాజేశ్వర్, సంకెం డ్ల నర్సయ్య పాల్గొన్నారు.

● రామగిరి (ఆంధ్రజ్యోతి): మండలంలోని సెంటినరీకాలనీలో జరిగిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మోల్మూరి శ్రీనివాస్, డైరెక్టర్‌లు గంట వెంకటరమణ రెడ్డి, శరణ్యయాదవ్, ఆసం తిరుపతి, శ్రీపాదరావు, సురేష్, సదానందం, తదితరులు పాల్గొన్నారు.

● కమాన్‌పూర్ (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆపిల్‌కిడ్స్ పాఠశాలలో కరస్పాండెంట్ చదువు వెంకటరెడ్డి, ప్రిన్సిపాల్ రాజమణి, భూలక్ష్మి, గౌతమి, బేజా, ఫాజియా, చామంతి తదితరులు నివాళులర్పించారు.



జూలపల్లిలో నివాళులర్పిస్తున్న నాయకులు



కాల్వశ్రీరాంపూర్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

రామగిరి ఖిల్లాకు 'పర్యాటక' సొబగులు

(3వ పేజీ తరువాయి)

అని పిలిచేవారట. ప్రస్తుతం బేగంపేటగా రూపాంతరం చెందినట్లు తెలుస్తోంది. మహమ్మదీయుల కాలంలో బేగంలను ఉంచడం వల్ల బేగంపేట అని పేరు వచ్చిందని పలువురు చెబుతున్నారు. రామగిరి పక్కన పోతన పేరుతో పోతారం, ఆయన తల్లి లక్కమాంబ పేరుతో లక్కారం, నాగళ్లను నిలిపే చోటును నాగెపల్లి అని, శుక్రవారం సంత జరిగే(చోటు) ప్రాంతాన్ని శుక్రవారంపేట అని, మైదంపిండి విసురు రాయి ఉన్న వీధికి మైదంబండ అని పేర్లు వచ్చాయని చారిత్రిక ఆధారాల ద్వారా తెలుస్తోంది. రామగిరి ఖిల్లాపై ఉన్న సుందర దృశ్యాలు, ప్రాకారాలు, సందర్శకులను ఇట్టే ఆకర్షిస్తాయి.

ఖిల్లా చరత్రకు అక్షర రూపం..

ఈ దుర్గం చరిత్రను కొంత వరకు వెలికితీసిన ఘనత పెద్దపల్లికి చెందిన ఆర్. బాలప్రసాద్‌కు దక్కగా, అంతకు ముందే రామగిరి చరిత్రను పుస్తక రూపంలో వెలువరించిన ఘనత మంగపేటకు చెందిన యరబాటి బాబురావుకు దక్కింది. కమాన్‌పూర్‌కు చెందిన మాధవరావు బలరామదాసు రామగిరి మహత్యం పేరుతో ఓ గ్రంథాన్ని రాశారు.

కేంద్ర మాజీ మంత్రి పాదయాత్ర..

రామగిరి ఖిల్లాను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో గతంలో కేంద్ర మాజీ మంత్రి విద్యాసాగరరావు బీజేపీ ఆధ్వర్యంలో పాదయాత్ర చేసి రామగిరి దుర్గాన్ని సందర్శించారు. ఇక్కడ పురాతన కట్టాలను పరిశీలించి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపారు. ప్రధాన రహదారి నుంచి కోట వరకు రోడ్డు నిర్మాణానికి రాజ్యసభ సభ్యులు ఇరవై లక్షల రూపాయలను కేటాయించగా నక్సలైట్ల హెచ్చరికలతో నిలిచిపోయింది. ఆ తర్వాత అప్పటి కలెక్టర్ నీతూకుమారిప్రసాద్ ఖిల్లాను సందర్శించి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తామని ప్రకటించారు.

శ్రావణమాసంలో సందడి..

ప్రకృతిఅందాలకు, చారిత్రాత్మకతకు చిహ్నంగా నిలిచిన రామగిరి ఖిల్లాపై శ్రావణ మాసంలో పర్యాటకుల సందడి నెలరోజుల పాటు కొనసాగుతుంది. శ్రావణ మాసంలో ప్రతి సోమ, శనివారాల్లో పాఠశాలల, కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు, ప్రకృతి ప్రేమికులు, యువకులు, మహిళలు, భక్తులు భారీగా తరలివచ్చి రామగిరి ఖిల్లాను సందర్శిస్తారు. గుట్టపైన దాదాపు 6 కిలోమీటర్లు అడవిలో కాలిబాటన కొండలు ఎక్కుతూ దిగుతూ.. సెలయేరులు దాటుతూ.. రాజులు నిర్మించిన కోటలు, కోట ముఖ ద్వారాలు, చెరసాలలు, కొలనులు, యుద్ధ ఫిరంగులు, శిల్పకళా సంపదను తనివితీరా చూసే పర్యాటకులు మానసిక ఆనందానికి లోనవుతారు. ప్రకృతి అందాల ఒడిలో పిండివంటలు, వనభోజనాలతో సామూహికంగా ఉల్లాసంగా ఉత్సాహంగా గడుపుతారు. చివరగా కొండ గృహలో ఉన్న శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుడు, హనుమంతుడి విగ్రహాలను దర్శించుకొని ఆధ్యాత్మిక అనుభూతిని పొంది తిరుగుప్రయాణమవుతారు.

ఎస్సారెస్పీ కాలువలో చెత్త తొలగింపు

కాల్వశ్రీరాంపూర్, జనవరి 12(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇదిలాపూర్, పెద్దరాత్‌పల్లి గ్రామాల మధ్య ఉన్న ఆర్ఎస్ డి 4.22ఆర్ ఎస్సారెస్పీ కాలువలో ఎన్నో ఏండ్లుగా చెత్తపేరుకుపోయింది. ఇదిలాపూర్, పెద్దరాత్‌పల్లి ఎస్సారెస్పీ ఆయకట్టు రైతులకు చెత్త పేరుకుపోవడం వలన రైతులకు సాగునీరు అందక అనేకక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై స్పందించిన ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు ఆదివారం రెండు గ్రామాల మధ్యన ఉన్న ఎస్సారెస్పీ కాలువలో పేరుకుపోయిన చెత్త, పిచ్చిమొక్కలను ఎక్స్‌వేటర్ సహాయంతో తన సొంత ఖర్చులతో తొలగించడం జరిగిందని మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్ అన్నారు. ఈ సందర్భంగా కాలువలో చెత్త తొలగించకపోవడంతో కాలువ చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందక అనేక ఇబ్బందులు పడ్డ విషయంలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోవడం జరిగిందన్నారు. ఈ విషయంపై స్పందించి ఎమ్మెల్యే కాలువలను తన సొంతఖర్చులతో శుభ్రం చేయించారన్నారు. దీంతో డి83కాలువ ద్వారా వచ్చే నీరు మండలంలోని క్రింది ప్రాంతాలైన ఇదులాపూర్, పెద్దరాత్‌పల్లి గ్రామాలకు సాగునీరు అందుతుందన్నారు. కాలువలు శుభ్రం చేయించిన ఎమ్మెల్యేకు మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజానవేన సదయ్యతోపాటు రెండు గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయం..

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నివసించే పేద కుటుంబాలను గుర్తించి వారికి సేవలు అందించడంలో లయన్స్ క్లబ్ ఉత్తమ ప్రశంసలు అందుకుంటోందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. ఆదివారం మండలంలోని రంగాపూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ రీజియన్ మీట్ కార్యాక్రమం నిర్వహించగా ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ లయన్స్ క్లబ్‌ల ద్వారా గ్రామాల్లో ఉచిత డయాబెటిస్ క్యాంపులు, పేదవారికి ఆర్థిక సాయం, నిరుపేదలకు ముడిసరుకులు, ఉచిత వైద్య శిబిరాలు, కంటి ఆపరేషన్‌లు వంటివి చేయడం ద్వారా చాలామందికి ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు, వివధ మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే విజయరమణారావు



పెద్దపల్లిలో విజేతలకు బహుమతులు ప్రదానం..



ఖనిలో బహుమతుల ప్రదానం..

పెద్దపల్లి కల్చరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి పట్టణంలోని ఆర్యవైశ్య భవన్‌లో ఆదివారం జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. ముందస్తు సంకాంత్రి వేడుకలలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్ ఎమ్మెల్యే విజయరమణారావు స్థానిక నాయకులతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొని భోగి మంటలను వెలిగించి ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే విజయరమణారావు నియోజకవర్గ ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్లు ఈర్ల స్వరూప, మినుపాల ప్రకాష్‌రావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సురేష్‌గౌడ్, పట్టణ కౌన్సిలర్లు, సింగల్ విండో చైర్మన్లు, మహిళలు, పట్టణ యువతులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

● పెద్దపల్లి రూరల్ (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హన్మంతునిపేట రామాలయంలో ఆదివారం కాంగ్రెస్ నాయకులు తిరుపతిరావు ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి వేడుకల్లో భాగంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు, యువతులు వేసిన రంగు రంగుల ముగ్గులు ఆకట్టుకున్నారు. ముఖ్యఅతిథిగా పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప హాజరై ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

● కోల్‌సిటీటౌన్ (ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ మాతృశక్తి దుర్గా వాహిని మహిళా విభాగం ఆధ్వర్యంలో గోదావరిఖని మార్కండేయకాలనీలోని ప్రైవేట్ పాఠశాల ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ ఇంజనీర్ అంబటి అర్చనసంతోష్‌రావు హాజరై పోటీలను ప్రారంభించారు. గెలుపొందిన మహిళలు రమాదేవి, స్వర్ణలత, ఎర్ర పద్మలకు బహుమతులు అందజేశారు. విశ్వహిందూ పరిషత్ విభాగ కార్యదర్శి అయోధ్య రవీందర్, జిల్లా కార్యదర్శి రవీందర్, నాగుల మల్యాల సత్యం, నగర కార్యదర్శి రవీందర్, ఇసంపెల్లి వెంకన్న, సంపత్‌యాదవ్, బండ సమ్మన్న, బండ రాజేష్, లింగన్న, మాతృశక్తి నగర సంయోజిక భవాని, విశ్వమిత సంయోజిక ఆరెల్లి మమత, సభ్యులు స్వప్న, లలిత, సంగీత, దీప్తి, శ్రావ్య, మహిళా విభాగం కార్యకర్తలు పాల్గొన్నారు. రామగుండం నియోజకవర్గం విశ్వబ్రాహ్మణ ఆఫీషియల్స్, ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వీరబ్రహేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో విశ్వబ్రాహ్మణ మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన మహిళలకు నగదు బహుమతులు అందజేశారు. నాగులమల్యాల రాజమౌళి, పానుగంటి స్వామి, మామిడిపల్లి భాస్కర్, జాంపురం ప్రభాకర్, ఉపేందర్, పానుగంటి మారుతి, కత్రోజు, మోహన్, రామయ్య, రాజయ్య, రవీంద్రచారి, స్రవంతి, సదానందచారి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● జూలపల్లి (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దాపూర్‌లో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న మహిళలు తెలంగాణ సంస్కృతిక సంప్రదాయలను ప్రతిబింబించేలా ముగ్గులను వేశారు. విజేతలకు బహుమతులను నిర్వాహకులు అందజేశారు. బీఆర్ఎస్ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు సంకెండ్ల లక్ష్మీనర్సయ్య, నాయకులు తొగరి శ్రీనివాస్,కల్లెపెల్లి ఉమేందర్, దాడి రవిందర్, గడ్డమీది నరేష్, వెంకటేశం, శంకర్ పలువురు పాల్గొన్నారు.

● యైటింక్లయిన్‌కాలనీ (ఆంధ్రజ్యోతి): న్యూమారేడుపాక పెద్దమ్మ తల్లి ఆలయ ఆవరణలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. డివిజన్‌కు చెందిన మహిళలు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్పొరేటర్ తాళ్ళ అమృతమ్మ ఉత్తమ ముగ్గులను ఎంపిక చేశారు. మహిళలకు నిర్వాహకులు బహుమతులను అందజేశారు. ఈ పోటీలను నీలి రాజయ్య, చొప్పరి శంకరయ్య, తాళ్ళ సురేష్‌లు నిర్వహించారు.

● సుల్తానాబాద్ (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీరాంనగర్‌లో ముందస్తు సంబరాలు జరుపుకున్నారు. మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు మెంగని రాధ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో మహిళలు పాల్గొని తమ ప్రతిభను చాటుకుని బహంతులు గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో వాసవి వనిత క్లబ్ వారు కూడా పాల్గొని మరో ముగ్గురు మహిళలు బహుమతులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఎనగంటి సుభాషిణి నారాయణరావు, రుద్రారపు కనుకయ్య, రౌతు రవీందర్, కత్తెర్ల పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సాన రామకృష్ణారెడ్డి

కమాన్‌పూర్, జనవరి 12 : (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సాన రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం విశ్వ విజ్ఞాన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని యువతకు సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. విశ్వ విజ్ఞాన్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లారపు అరుణ్‌కుమార్, నల్లవెల్లి శంకర్, మట్ట శంకర్, రంగు సత్యనారాయణ, జంగపల్లి అజయ్, పిన్‌రెడ్డి కిషన్ రెడ్డి, కొయ్యడ సతీష్, జంగపల్లి రాజేష్, చిప్పకుర్తి సత్యనారాయణ, భూంపల్లి మొండయ్య, బర్ల సదానందం, రణవేని లక్ష్మీనారాయణ, వడ్లకొండ తిరుపతి, సారయ్య, సతీష్, సుధాకర్, చంద్రమౌళి, శేఖర్, మల్యాల తిరుపతి, మోరప్రశాంత్ తదితరులు ఉన్నారు.

ఎల్-83 కెనాల్ పూడికతీత పనులు ప్రారంభం

మంథనిరూరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పుట్టపాక, వెంపాడు, అక్కెపల్లి, సిద్దపల్లి, రామయ్యపల్లి గ్రామాలకు సాగునీరందించే ఎల్-83 కెనాల్ పూడితీత పనులు ఆదివారం ప్రారంభించారు. ఎల్-83 కెనాల్ కొంత కాలంగా పిచ్చి మొక్కలు, వర్షాకాలం మట్టితో నిండటం వలన సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతుండటంతో మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లినట్లు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ఐలి ప్రసాద్ తెలిపారు. స్పందించిన మంత్రి సింగరేణి యాజమాన్యంతో మాట్లాడి పనులు త్వరగా పూర్తిచేయాలని ఆదేశించడంతో సింగరేణి అధికారులు కాలువ పూడిక తీసే పనులు ప్రారంభించినట్లు ఆయన తెలిపారు.

సుల్తాన్‌పూర్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

ఎలిగేడు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సుల్తాన్‌పూర్‌లో పదో తరగతి 2005-06బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు ఆగయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు. ముఖ్య అతి థులుగా మాజీ సర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ స్రవంతిమోహన్‌రావు హాజరై విద్యార్థుల జీవన ప్రగతిని ప్రశంసించారు. ఈ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను పంచుకొని, పాఠశాలలో గడిపిన రోజులను గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయుల కృషికి కృతజ్ఞతలు తెలియజేసి, పాఠశాల, గ్రామాభివృద్ధికి తమవంతు సహకారం అందించనున్నట్లు వెల్లడించారు. పాఠశాల ఆవరణలో ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, సభముగింపు సందర్భంగా ఉపాధ్యాయులు, అతిథులకు సన్మానాలు చేపట్టారు. పాఠశాలకు తమవంతుగా రూ.25వేల రూపాయలు విరాళం ప్రకటించారు. ఈ కార్యక్రమానికి హాజరైన నిర్వాహకులు పోలు సతీష్, తిరుపతి, ప్రశాంతి, ఆనంద్, చందు, సురేష్, విజయ్, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్న ఎస్‌ఎస్‌వో

రామగిరి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-3 డివిజన్‌లో ప్రైవేట్ సెక్యూరిటీగార్డు పనిచేస్తున్న ఆకుల శ్రావణ్ ఇటీవల మృతిచెందగా ఆయన కుటుంబానికి ఆర్జీ-3 ఎస్‌అండ్‌పీసీ, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు సంయుక్తంగా విరాళంగా సేకరించిన 96,600 రూపాయాలను ఎస్‌ఎస్‌వో షబ్బీరుద్దీన్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ పోగుల స్వామి చేతుల మీదుగా సెక్యూరిటీగార్డు కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో జమేదార్ ఓదన్నా, బొచ్చు శంకర్, వైష్ణవి కాంట్రాక్టర్ సతీష్, కుమారస్వామి, మేడ రమేశ్, అగ్గినాగరాజు, సూపర్‌వైజర్లు తూముల రాజేశం, కల వేన సదానందం, మహేందర్, ప్రైవేట్ సెక్యూరిటీగార్డులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టుల వైఫల్యం వల్లనే నక్సల్‌బరి ఉద్యమం

- రచయిత అల్లం రాజయ్య

ఓదెల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : మొదటిసారి 1947లో సాయుధ పోరాటాన్ని ప్రారంభించిన కమ్యూనిస్టులు రష్యా పద్ధతిలో కృత్రిమ ఉద్యమాలు సాధించాలనే తప్పుడు అవగాహన పద్ధతితో ముగిసిపోయిందని, వారి వైఫల్యం వల్లనే 1967లో నక్సల్‌బరి ఉద్యమం ప్రారంభమైందని రచయిత అల్లం రాజయ్య అన్నారు. మండలంలోని కనగర్తిలో ఆదివారం ఇట్యాల వెంకటయ్య సంస్మరణ సభలో తహసీల్దార్ ఇట్యాల వెంకటకిషన్ రచించిన ధరణి కథల పుస్తకాన్ని ఇట్యాల కనుకవ్వతో కలిసి అల్లం రాజయ్య ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన అల్లం రాజయ్య మాట్లాడుతూ దేశంలో విజ్ఞానాన్ని, హేతువును హత్య చేశారని, దీంతో దేశాన్ని మోసం చేసే అవకాశం దొరికిందన్నారు. కనగర్తిలో ఎంతో చైతన్యం కలిగిన కమ్యూనిస్టు మాజీ నాయకుడు ఇట్యాల వెంకటయ్య సామాజిక పరిస్థితులను అర్థం చేసుకుని ఉద్యమాల్లో క్రియాశీలంగా పనిచేశారన్నారు. అప్పటికి, నేటికి కనగర్తిలో ఉత్పత్తి వనరులను పంపిణీ జరగలేదని, పాత భూస్వామిక ఉత్పత్తులే కొనసాగుతున్నాయని, ప్రస్తుతం గ్రామాల్లో భూస్వామ్య అణచివేత విధానం సర్వసాధరణమైందన్నారు. ఈ నేపథ్యంలో కనగర్తిలో 40ఏళ్ల పాటు కొనసాగిన సీపీఐ పోరాటాలు, అప్పటి నాయకుల చరిత్రను తహసీల్దార్ ఇట్యాల వెంకటకిషన్ స్వయంగా పుస్తకంగా రచించారన్నారు. అనంతరం పలువురు రచయితలు, సినీ రచయితలు, కళాకారులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్, అల్లం నారాయణ, అప్పటి కమ్యూనిస్టు నాయకులు ఆది మధుసూధన్‌రావు, కె.స్వామి, తాళ్లపల్లి లక్ష్మణ్, దయా నర్సింగ్, రాదండి సదానందం, కేయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ చింతం ప్రవీణ్, రచయిత బాలసాని రాజయ్య, శ్రీరామోజు లక్ష్మీరాజం, సురేందర్‌రెడ్డి, తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంగ రవిందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కనగర్తిలో ధరణి కథల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయిత, తదితరులు

గుండెపోటుతో రిపోర్టర్ మృతి

పాడె మోసిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని/కోల్‌సిటీ, జనవరి 12(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పట్టణానికి చెందిన ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్ సిరిశెట్టి చిరంజీవి(46) ఆదివారం గుండెపోటుతో మృతిచెందాడు. ఇంట్లో పల్స్‌పడిపోవడంతో గోదావరిఖని ప్రభుత్వాసుత్రికి తరలించగా, అప్పటికే చిరంజీవి మృతిచెందినట్టు వైద్యులు పేర్కొన్నారు. చిరంజీవికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కాగా, చిరంజీవి పాడెను రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ మోశారు. చౌరస్తాలోని చిరంజీవి నివాసం నుంచి హనుమాన్‌నగర్ వరకు నిర్వహించిన అంతిమయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే జర్నలిస్టు మృతదేహాన్ని మోసుకువచ్చారు. చిరంజీవి మృతదేహం వద్ద నివాళులర్పించిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ గోదావరి వరకు సాగిన అంతిమయాత్రలో పాల్గొన్నారు.